క్లుప్తంగా

విశ్వకర్మ చిత్రపటాలు అందజేత



ముప్పాళ్ళ: భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వామి చిత్రపటాలను అందిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చింతడ రమేష్ చెప్పారు. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, పీహెచ్‌సీల్లో స్వామి చిత్రపటాలను శుక్రవారం అందించారు. సెప్టెంబర్ 17న విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం వద్ద జయంతి నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కోటగిరి పోతులూరయ్య, ముప్పాళ్ళ మండల బాధ్యులు కోసూరి రాంబాబు, గుత్తికొండ వెంకటాచారి, తేనేపల్లి శ్రీనివాసాచారి, కన్నెగంటి రామబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు దివ్యశ్రీ ఎంపిక



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బుర్రా దివ్యశ్రీ జిల్లా స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దయ్య తెలిపారు. నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శుక్రవారం జరిగిన కరాటే పోటీల్లో ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా దివ్యశ్రీని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎల్ఐసీ ఏజెంట్ మృతికి నివాళి



సత్తెనపల్లి: పట్టణంలో 9వ వార్డుకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ విప్పల చలమారెడ్డి (53) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. మరణవార్త తెలియడంతో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు నివాళులర్పించారు. రాజుపాలెం మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, క్రోసూరు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఎల్ఐసీ ఏజెంట్లు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలివే

ముప్పాళ్ళ: మండలంలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కేవీ దమ్మాలపాడు ఫీడర్, 11 కేవీ ముప్పాళ్ళ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 13వ తేదీన కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ జి.సుచరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ, బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ, 11 కేవీ లైన్లకు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సత్తెనపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా పట్టణం మొత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కరెంట్ ఏఈ పీబీ కిరణ్ తెలిపారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



రాజుపాలెం: ఉపాధ్యాయులు, ఉద్యోగులపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు, వేతన సవరణలు, కరువు భత్యం మంజూరు చేయలేదన్నారు. వారి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు అద్దంకి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కొడవటి రవికుమార్, సభ్యులు రత్తయ్య, హేమకిరణ్, తులసీ రమాదేవి పాల్గొన్నారు.

యూరియా.. పడిగాపులు తప్పదయా!



సత్తెనపల్లి ఏఎంసీలోని జీడీసీఎంఎస్ గోదాం వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



టోకెన్ల పంపిణీ కౌంటర్ వద్ద రైతులు

యూరియా కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచే సత్తెనపల్లిలో యూరియా పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరి కనిపించారు. కొందరికి టోకెన్లు దొరకక నిరాశగా వెనుదిరిగారు. టోకెన్లు దొరికిన వారు మాత్రం పొద్దున నుంచి మధ్యాహ్నం వరకు ఎదురుచూస్తే కేవలం రెండు బస్తాల యూరియా మాత్రం అందడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

–సత్తెనపల్లి

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, వారే ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు అర్హులని జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీసాయిబాబా కల్యాణ మండపంలో శుక్రవారం ఫ్యాప్టో ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి అభినందన సభ జరిగింది. ఎంఈవో ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు గట్టి పునాది వేస్తే కీర్తి గడిస్తాడన్నారు. ఎంఈవో ప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర వెలకట్టలేనిదన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కోనూరు ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు గంధం గంగయ్య, నీలేశ్వరపాలెం ఎంపీపీఎస్ ఉపాధ్యాయిని సంధ్యాల శివపార్వతిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తుమ్మా శౌర్రెడ్డి, బి.సాంబశివరావు, ఆర్.వేణుగోపాలరావు, షేక్ మహబూబ్ సుభాని, ఎ.నటరాజు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: మండలంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులను ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె.నాగేశ్వరరావు(ఎంపీపీఎస్, మాదల), కె.మంజుల(జెడ్పీహెచ్ఎస్, బొల్లవరం), వి.సీతారామయ్య(జెడ్పీహెచ్ఎస్, బొల్లవరం)లను ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి.సుధారాణి, కె.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, ఎంఈవో, తోటి ఉపాధ్యాయులు



ముప్పాళ్ళ ఎమ్మార్సీలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘ నేతలు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



సత్తెనపల్లి: రానున్న అన్ని ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని ఆ పార్టీ యూత్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ ముఖ్తార్ అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డిని కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ కార్యకర్తలు హబీబ్, ఫజల్, నజీర్, తదితరులు ఉన్నారు.

26 మంది రక్తదానం

పెదకూరపాడు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తహసీల్దార్ నీలి ధనలక్ష్మి అన్నారు. పెదకూరపాడు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎంపీడీవో సోమయాజులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి, ప్రమాదాలు గురైన వారికి రక్తం ఎంతో అవసరమన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ శిబిరంలో మొత్తం 26 మంది దాతలు రక్తాన్ని అందించారు.

ఆటోడ్రైవర్‌కు జైలు శిక్ష

అమరావతి: ఆటోడ్రైవర్‌కు 16 నెలల జైలు శిక్ష పడింది. జూపూడి గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, జెట్టి నాగేంద్రమ్మ, మెరుగుమల చిన్నమ్మకలిసి ద్విచక్ర వాహనంపై 2017 అక్టోబర్ 21వ తేదీ మల్లాదికి కూలీపనుల నిమిత్తం వెళ్తున్నారు. పెట్రోల్‌బంక్ వద్ద వెనుక నుంచి వచ్చిన ఆటోడ్రైవర్ రుద్రమాల జేసు ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలు కాగా మిగిలిన ఇద్దరు జెట్టి నాగేంద్రమ్మ, మెరుగుమల చిన్నమ్మ అక్కడికక్కడే మరణించారు. అప్పట్లో అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్ట్‌లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఫిర్యాది తరపున లాయర్ ప్రసాద్ నాయక్ వాదనలు వినిపించగా శుక్రవారం సత్తెనపల్లి 2వ అదనపు సివిల్ జడ్జి సుజిన్ కుమార్ నిందితునికి 16 నెలలు జైలు శిక్ష, రూ.11,000 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సాగునీరు అందడానికి ప్రణాళికలు

ఇరిగేషన్ డీఈ కృష్ణ



డిస్ట్రిబ్యూటర్ కమిటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు అప్పారావు

పెదకూరపాడు: అమరావతి మేజర్ పరిధిలోని చివరి సాగు భూమి వరకు సాగునీరు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఇరిగేషన్ డీఈ కృష్ణ అన్నారు. శుక్రవారం అమరావతి మేజర్‌పై ఉన్న 14వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సర్వసభ్య సమావేశం పెదకూరపాడులోని ఎన్ఎస్ కెనాల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో డీసీ పరిధిలోని కాలంలో నీటి సరఫరా, నీటి నియంత్రణపై చర్చించారు. కాలువలో వృథాగా పోయే నీటి అరికట్టడం, చివరి భూములు అన్నిటికీ సాగునీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవడంపై చర్చించారు. లస్కర్ల నియామకం, రెగ్యులర్ లస్కర్ల సమస్యలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఏఈలు చిరంజీవిరెడ్డి, నరేంద్ర కుమార్ నీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యూరియాతోపాటు 'నానో' కూడా వినియోగించండి

ఏవో వేణుగోపాల్



సత్తెనపల్లి గోదాం వద్ద అవగాహన కల్పిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి

క్రోసూరు: సాధారణ యూరియాతో పాటుగా ప్రత్యామ్నాయంగా నానో యూరియాను రైతులు వినియోగించవచ్చని మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ శుక్రవారం యూరియా పంపిణీ జరుగుతున్న పీఏసీఎస్ వద్ద రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఏవో తెలుపుతూ ద్రవరూపంలో ఉండే నానో యూరియాలో గుళికల రూపంలో ఉండే యూరియాతో సమానమైన నత్రజని ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా నానో యూరియాపై అవగాహన కల్పించాలని ఆదేశాలిచ్చిందన్నారు.

యూరియా ఎక్కువగా నిల్వ చేసుకోవద్దు

సత్తెనపల్లి: రైతుల అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని, అధిక నిల్వలు చేసుకోవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలోని జీడీసీఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రంలో శుక్రవారం 19.8 మెట్రిక్ టన్నుల (440 బస్తాలు) యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ పీఏసీఎస్, రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రవిబాబు, సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ డీఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కూటమి ఇచ్చిన హామీలు అమలుచేయాలి

కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించిన బీసీ సంక్షేమ సంఘ నాయకులు



కలెక్టరేట్‌లో డీఆర్ఓ మురళికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమసంఘ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని బీసీలకు కూటమి నాయకులు 2024ఎన్నికలలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో డీఆర్ఓ ఎ.మురళికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ బీసీలకు కావాల్సిన రక్షణ చట్టం, స్థానిక సంస్థల ఎన్నికలలో 33శాతం రిజర్వేషన్లు, చట్టసభ ఎన్నికలలో 34శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, రాజధాని అమరావతిలో మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలేల స్మృతివనం ఏర్పాటు చేయాలనే ఐదు ప్రధాన డిమాండ్లపై బీసీ సంఘం తరపున వినతిపత్రం సమర్పించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్న ఇంతవరకు ఆ ఊసే ఎత్తటం లేదని అన్నారు. ఏప్రిల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగుస్తున్న వేళ మూడు నెలలు ముందే ఎన్నికలు నిర్వహిస్తామని ఎలక్షన్ కమిషన్ ప్రకటించిందని, కాని ఇప్పటివరకు రాష్ట్రంలో కుల గణన సమగ్రంగా నిర్వహించకుండా స్థానిక, ప్రాదేశిక నియోజకవర్గం విభజన పూర్తిచేయకుండా బీసీలకు స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్లు ఎలా నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కొల్లిపర బాలాజీ, సుతారం విశ్వేశ్వరరావు, సరికొండ తిమ్మరాజు, ఫణిదం బోసు బాబు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నరసరావుపేట టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని టూటౌన్ ఎస్ఐ అశోక్ తెలిపారు. టూటౌన్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన, బీమా పత్రాలు లేని వారు, హెల్మెట్ ధరించని వారిని గుర్తించి కేసు నమోదు చేశారు. వాహనచోదకులు విధిగా పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకులకు మొదట జరిమానా, రెండవ సారి పట్టుబడితే కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరుస్తామన్నారు.

స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని తన కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణంలోని 30 స్వయం సహాయక సంఘాలకు వివిధ బ్యాంకుల కింద మంజూరైన బ్యాంకు లింకేజీ రుణాలు రూ. 4 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల పని భారం తగ్గించాలి

నరసరావుపేట: రాష్ట్రంలోని దాదాపు లక్షన్నర మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నేటి కూటమి పాలనలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 1 నుండి నిరవధిక ఆందోళన చేపట్టాలని నిర్ణయించడం హర్షణీయమని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్, రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయున్ భాష పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

దంత సంరక్షణతోనే ఆరోగ్య రక్ష



చిలకలూరిపేట: దంత సంరక్షణతోనే ఆరోగ్య సంరక్షణ సాధ్యమౌతుందని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినే ఆహారాన్ని చక్కగా నమిలి మింగేందుకు ఆరోగ్యకరమైన దంతాలు కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దంత వైద్యులు డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ దంతాలను ఎలా శుభ్రపరుచుకోవాలి, వాటిని ఎలా సంరక్షించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొల్లా సుబ్బారావు, చెంచు పున్నయ్య, రాఘవయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామాల్లో నీటి తొట్టెలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

అమరావతి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన డాక్టర్ శివరత్నకుమార్, డాక్టర్ మౌనిక, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరత్నకుమార్ మాట్లాడుతూ ప్రజలు దోమతెరలు వాడాలని, ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకొని ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చన్నారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతు ప్రతి శుక్రవారం ప్రజలందరూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమానికి సహకరించాలన్నారు. ప్రతిరోజూ ప్రతి గ్రామంలోని ఆశాకార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వేచేసి అవసరమైతే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీమనోహర్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాలొన్నారు.

మాదలలో రెండు ద్విచక్ర వాహనాలు మాయం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదలలో ఒకే రాత్రి నిమిషాల వ్యవధిలోనే రెండు ద్విచక్ర వాహనాలు మాయమైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామంలోని ప్రధాన కూడలికి సమీపంలోని నల్లగుండ్ల అంజిబాబు తన షైన్ ద్విచక్ర వాహనం, సమీపంలోనే ఉండే కొప్పురావూరి పరమేష్ తన బుల్లెట్ వాహనాన్ని వారి ఇళ్ల ముందు నిలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఇంటి ముందు ఉన్న వాహనాల తాళాలు తొలగించి వాటిని నెట్టుకుంటూ వెళ్లిపోయారు. సమీపంలోని దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కావటంతో వాహనాలు చోరీకి గురైనట్లుగా నిర్ధారించుకున్నారు. అంతకు ముందు రోజు మాదల శివారు గ్రామమైన రామకృష్ణాపురంలోలో వరి నాట్లు వేసేందుకు వచ్చిన కూలీలకు చెందిన పల్సర్ వాహనాన్ని ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. వరుస ఘటనలపై బాధితులు ముప్పాళ్ళ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

వెల్ఫేర్ బోర్డ్‌ను పునరుద్ధరించండి

సీఐటీయు పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



సత్తెనపల్లిలో కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయు నాయకులు

సత్తెనపల్లి: భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఈనెల 15న జరిగే రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులంతా విజయవాడకు తరలిరావాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కోట ఆంజనేయులు పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలోని అమరావతి బస్టాప్ వద్ద శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో కలసి ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కాలం పూర్తయినప్పటికీ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. అనేకసార్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని, ఉప ముఖ్యమంత్రిని, ఇతర ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవించుకున్నా వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, పట్టణ అధ్యక్షుడు జి.సాల్మన్ రాజు, మండల కార్యదర్శి షేక్ సైదులు, సీఐటీయూ నేతలు పురుషోత్తం, ఇతర ప్రజాసంఘాల నాయకులు జిల్లేళ్ళ పాల్ రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



మాదలలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, నార్నెపాడు గ్రామాల్లోని సీపీఎం కార్యాలయాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ శుక్రవారం జరిగింది. సీతారాం ఏచూరి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ మార్క్సిజాన్ని అధ్యయనం చేసిన గొప్ప మేధావి సీతారాం ఏచూరి అని, విద్యార్థి నాయకుడి నుంచి పాలక పక్షాలను ప్రశ్నించడం అలవర్చుకున్నారని కొనియాడారు కార్యక్రమంలో నేతలు మార్పుల వెంకటరెడ్డి, కందిమళ్ళ సాంబశివరావు, గారా జాలయ్య, రావిపాటి వెంకటేశ్వర్లు, తోట బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: ఆమంచి విజ్ఞాన కేంద్రంలో తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన సీతారాం ఏచూరి వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ విశిష్టత అనే అంశం మీద సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అనుమల లక్ష్మీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి, రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలను ఏక తాటి మీదకు తీసుకువచ్చి ఇండియా కూటమిని నిలబెట్టే ప్రయత్నంలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో గల్లా రమణమ్మ, గారపాటి సైదా, నీరుకొండ చిన్నమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం భూములపై హక్కులు కల్పించాలి

జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోపాలరావు

నూజెండ్ల: పోరాటాల ద్వారానే అగ్రహారం భూములపై హక్కులు సాధించుకోవచ్చని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోపాలరావు సూచించారు. మండలంలోని గొల్లపాలెం, తిమ్మాపురం, వి.అప్పాపురం గ్రామాల్లో శుక్రవారం రైతు సంఘం నాయకులు సదస్సులు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు హనుమంత రెడ్డి అధ్యక్షతన అగ్రహారం భూముల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండప్రోలు గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో అగ్రహారం భూముల పోరాట కమిటీ అధ్యక్షులుగా వావిలాల గురుస్వామి, కార్యదర్శులుగా నాగిరెడ్డి రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షులు గోపాలరావు మాట్లాడుతూ అగ్రహారం రైతుల భూ సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని అన్నారు. మండల పరిధిలోని 6200 ఎకరాలు అగ్రహారం భూములు ఉండగా అనుభవంలో ఉన్న రైతులకు వారి యాజమాన్య హక్కులు కల్పించడానికి ప్రభుత్వాలు, రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు చిత్తశుద్ధి చూపటం లేదని విమర్శించారు. సర్వే పూర్తి అయినప్పటికీ పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు సాకులు చూపుతున్నారని విమర్శించారు. సాగుదార్లకు వెంటనే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, మార్కాపురం అల్లూరిరెడ్డి, కంచుమాటి తరిపాలు, ఆవూరి శ్రీనివాసరెడ్డి, అమరా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి మనందరి లక్ష్యం కావాలి

చిలకలూరిపేట: ప్రపంచ శాంతిని వర్ధిల్లింపజేయడం ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఆవాజ్ అభ్యుదయ ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లోని మసీదు వద్ద ఆవాజ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలి... సామ్రాజ్యవాదం నశించాలి అనే నినాదంతో శుక్రవారం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజాలో శాంతి స్థాపన కోసం ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధం, హింసావాదంతో సాధించేది ఏమి ఉండదని, మహాత్ముడు చూపిన శాంతి మార్గంలో నడవడం ద్వారా సమాజం ప్రశాంతంగా ఉంటుందని వెల్లడించారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశం పాలస్తీనాకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ సంస్థ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.